హైవేగా మారినా.. హైరానే!

- అభివృద్ధికి నోచుకోని రాయచోటి ఓఆర్ఆర్
- గుంతలమయంతో వాహనదారుల అవస్థలు
- రోడ్డు పక్కనే గుట్టల్లా వ్యర్థాలు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు


వేంపల్లి-గాలివీడు మధ్య దెబ్బతిన్న రింగ్ రోడ్డు


మట్టిదిబ్బలకు నిలయంగా మారిన రింగ్ రోడ్డు


ప్రమాదకరంగా డంప్ చేసిన బండరాళ్లు

రాయచోటి : రాయచోటి ఔటర్ రింగ్ రోడ్డు (జాతీయ రహదారి) పరిస్థితి అధ్వానంగా తయారైంది. రాయచోటి అభివృద్ధి, పెరుగుతున్న రవాణాకు అనువుగా దివంగత నేత వైఎస్సార్ హయాంలో 17 కిలోమీటర్ల మేర పట్టణం చుట్టూ రింగ్ రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంతో కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిన వెళ్లే వాహనాల తాకిడి బాగా తగ్గింది. ఈ రింగ్ రోడ్డుకు మూడు జాతీయ రహదారులు అనుసంధానం కావడంతో రింగ్ రోడ్డును కూడా జాతీయ రహదారిలో భాగం చేసి అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు రింగ్ రోడ్డులోని కడప, వేంపల్లి, కదిరి, మదనపల్లి మార్గాలను కలుపుతూ చిత్తూరు జాతీయ రహదారి వరకు అంటే ఎనిమిది కిలోమీటర్ల మేర జాతీయ రహదారిగా మార్చారు. జాతీయ రహదారిగా పేరు మారిన ఆ మేరకు రోడ్డు అభివృద్ధి జరగలేదు.

ప్రమాదాలకు ఆస్కారం

త్వరతగతిన రహదారి మరమ్మతులు చేపట్టకపోతే భారీ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి ఔటర్ రింగ్ రోడ్డు జాతీయ రహదారుల ఆధ్వర్యంలో నిర్మించబడిన ఒక ముఖ్యమైన రహదారి, ప్రతిరోజూ ఈ రహదారిపై పెద్దసంఖ్యలో లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. ఈ రహదారి రాయచోటి ప్రజలకు ఎంతో ముఖ్యమైంది. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారకాలుగా మారాయి. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయం సమీపంలో కనకదుర్గ ఆలయానికి వెళ్లే రహదారి జంక్షన్ దగ్గర ఏర్పడిన గుంతలు వాహనదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోతే ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోలేదు. ఇదే గుంతలకు సంవత్సర కాలంలోనే రెండుసార్లు ప్యాచ్ వర్క్ చేసినా ఫలితం లేకుండా పోయింది. వేసిన ప్యాచ్ వర్క్ మూడురోజులకే ఊడిపోయి మళ్లీ పాత పరిస్థితికి వచ్చింది.

పెండింగ్‌లో రోడ్డు నిర్మాణం

జాతీయ రహదారి నిర్మాణానికి అధికారులు చేపట్టిన భూ సేకరణ ఇంకా కొన్ని ప్రాంతాలలో పెండింగ్‌లో ఉంది. భూమి హక్కుదారులు నష్టపరిహారం విషయంలో కోర్టుకు వెళ్లడంతో ఇంకా మూడు ప్రాంతాలలో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. వాహనాలు వెళ్తున్నా తారు వేయకపోవడంతో చిన్నపాటి వర్షాలు వచ్చినా ఆ ప్రాంతం అంతా గుంతలు, బురదమయంగా మారి వాహనదారులకు చుక్కలు కనబడుతున్నాయి.

డంపింగ్ యార్డుగా.. రింగ్‌రోడ్డు

రాయచోటి రింగ్ రోడ్డుకు ఇరువైపులా డంపింగ్ యార్డును తలపించేలా మట్టి దిబ్బలు, పెద్దపెద్ద బండరాళ్లతో నిండిపోయింది. పట్టణంలో నిర్మాణాలకు వాడి నిరుపయోగంగా ఉన్న మట్టిని, నిర్మాణ ప్రాంతాలలో బయటపడిన పెద్దపెద్ద బండరాళ్లను రోడ్డుకు ఇరువైపులా నిల్వ చేశారు. దీంతో వాహనాలు వేగంగా వెళ్లే సమయంలో ఏ మాత్రం పట్టు తప్పినా మట్టి కుప్పలకు, బండరాళ్లకు ఢీ కొట్టిప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. అదే జరిగితే ప్రాణాలు పోవడం తథ్యం. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎక్కడా కనిపించలేదు. ఇప్పటికైనా జాతీయ రహదారులశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డును విస్తరించాలి



రాయచోటి ఔటర్ రింగ్ రోడ్డును పూర్తిస్థాయిలో విస్తరించాలి. అనునిత్యం వాహనాల రద్దీతో ఉండే రింగ్ రోడ్డు గోతులుగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతిరోజూ మా కూరగాయల వాహనాలు వస్తుంటాయి. గుంతలను పూడ్చడం వలన ప్రయోజనం లేదు. కొత్తరోడ్డుగా నిర్మిస్తేనే బాగుంటుంది.

– ఎస్.జాకీర్ హుస్సేన్, కూరగాయల వ్యాపారి, రాయచోటి

డివైడర్స్ ఏర్పాటు చేయాలి



రింగ్ రోడ్డుకు డివైడర్స్ ఏర్పాటు చేయాలి. నాలుగు వరుసల రహదారిగా మారిస్తే వాహనదారులకు ఇబ్బందులు ఉండవు. ఇప్పుడు ఉన్నరోడ్డులో ప్రయాణిస్తుంటే వాహనాల రిపేరుకు అధికంగా ఖర్చులు చేయాల్సి వస్తోంది. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు.

– రమేష్ బాబు, జీపు డ్రైవర్, రాయచోటి

పంట బీమాపై సిబ్బందికి శిక్షణ


రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ ఇస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు మాజీద్

రాజంపేట రూరల్ : రబీ పంటలైన వరి, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటల బీమాపై రైతు సేవా కేంద్రం సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని ఎర్రబల్లి వద్దనున్న రైతు పరిశోధన శిక్షణ శిబిరంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణా కేంద్రం నుండి సహాయ వ్యవసాయ సంచాలకులు మాజీద్, వ్యవసాయ అధికారి రామకృష్ణరాజు, కడప వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మాధురీ పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఎరువులు వాడకంపై అవగాహన కలిగించారు. సస్యరక్షణచర్యలు అధిక దిగుబడికి చేపట్టవలసిన సాగు పద్ధతులు వివరించారు. అదే విధంగా వివిధ పథకాల గురించి అవగాహన కల్పించారు. పీఎంఎఫ్‌బీవై పంటల బీమా ప్రీమియం గురించి వివరించారు. రైతులు బ్యాంకు ద్వారా కానీ సీఎస్‌సీ సెంటర్ల ద్వారా ప్రీమియం చెల్లించే విధంగా దరఖాస్తు చేసుకోవచ్చని రైతులకు తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏఓ రమేష్‌బాబు, ఇంచార్జి వ్యవసాయ సంచాలకులు పవన్‌కుమార్, నందలూరు ఏఓ మల్లికార్జున, ఆత్మ బీటీఎం సుబ్రమణ్యం, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

కంటి రోగులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


కంటిరోగుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆకేపాటి

ఒంటిమిట్ట : గతనెల ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కంటి వైద్య శిబిరంలో వైద్యుల సలహాల మేరకు ఆపరేషన్ చేయించుకున్న 20 మంది రోగులకు శనివారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో తిరుపతి అరవింద ఆసుపత్రి వారు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి పరీక్షల వైద్య శిబిరానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి హాజరై కంటి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం కంటి ఆపరేషన్ చేయించుకున్న రోగులకు కళ్లు పరీక్షించి వారికి సరిపడా కళ్లజోడులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటి సమస్యతో బాధపడుతున్న రోగులు ఎవరైనా ఉంటే తమ ఫౌండేషన్ ద్వారా వారికి ఉచితంగా వైద్యం చేసితామని వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, నందలూరు మండల నాయకులు గీతాల నరసింహారెడ్డి, సిద్దవటం నాయకులు వల్లిఛాన్ తదిరులు పాల్గొన్నారు.

గనుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు


ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ గనుల భద్రతకు పటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్టు సీపీఓ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏపీఎండీసీ కార్యాలయం వద్ద 39వ గనుల భద్రత వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొద్దిరోజులుగా గనులను భద్రతా కమిటీ సభ్యులు తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సీపీఓ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రతి ఏడాది గనుల భద్రత వారోత్సవాలు నిర్వహించిందని, ఈ ఏడాది ఏపీఎండీసీ ఆధ్వర్యంలో నవంబర్ 16న విజయవాడలో ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. అనంతరం ఉద్యోగులకు, విద్యార్థులకు గనుల భద్రతపై పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అంతకుముందు భద్రత కమిటీ ప్రతినిధులు టి.సుదర్శన్ రెడ్డి, వై.సత్యనారాయణ, కృష్ణారెడ్డి మంగంపేట గనులలో భద్రతపై తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంబీపీ ప్రాజెక్టు అధికారి కృష్ణ, కార్మికులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి


విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అప్పుడే మంచి మార్గంలో ప్రయాణించి ఉన్నతస్థాయికి చేరుకోగలరని మానవత సేవా సంస్థ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, అధ్యక్షులు గాండ్లపల్లె ఖాదర్ బాషాలు అన్నారు. విద్యార్థులు - నైతిక విలువలు అనే అంశంపై కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు అనే విషయాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలతోపాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చెడును తుంచి.. మంచిని పెంచాలని సూచించారు. అందుకోసం ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదవడంతో పాటు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవత నాయకులు అంకం జయచంద్రారెడ్డి, వెంకటరమణ, వెంట్రామిరెడ్డి, రామచంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి, గుండ్లపల్లె వెంకటేష్, బీపీ నాగయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో కమాండెంట్


రామయ్య సన్నిధిలో బెటాలియన్ కమాండెంట్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారిని శనివారం సిద్దవటం 11వ బెటాలియన్ కమాండెంట్ బి.నాగరెడ్డప్ప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి అర్చకులు, అధికారులు ఘనంగా సత్కరించారు.

- డస్ట్‌బిన్‌లా తయారైన ఇండోర్ స్టేడియం
- కోట్లు వెచ్చించి నిర్మించినా నిరుపయోగం

ఇండోర్.. నో కేర్



నిరుపయోగంగా ఉన్న ఇండోర్ స్టేడియం


స్టేడియం దుస్థితికి అద్దం పట్టే మరుగుదొడ్లు


డస్ట్‌బిన్‌లా వసతి గదుల ప్రాంగణం

రాజంపేట టౌన్ : రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రెండుకోట్ల రూపాయిలకు పైగా వెచ్చించి నిర్మించిన ఇండోర్ స్టేడియం అధ్వానంగా తయారైంది. ఇక్కడి ఇండోర్ స్టేడియంను దాదాపు దశాబ్దం క్రితం క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా నిర్మించారు. పలు ఇండోర్ గేమ్స్‌ను ఆడుకునేందుకు వీలుగా గదులు సైతం ఉన్నాయి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్టేడియం నిర్మించిన కొత్తల్లోనే క్రీడాకారులు ఒక్కరోజు కూడా ఈ స్టేడియంను ఉపయోగించుకోలేని విధంగా తయారైంది. స్టేడియం నిర్మించిన వెంటనే నిర్వహణ బాధ్యతను ఎవరూ చేపట్టకపోవడంతో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు స్టేడియం అడ్డాగా మారింది. ఆసమయంలోనే మందుబాబులు, అకతాయిలు స్టేడియం కిటికీ అద్దాలు, డోర్‌లు, విద్యుత్ వైరింగ్‌ను సైతం ధ్వంసం చేశారు. ఆ తరువాత స్థానికంగా ఉన్న అధికారులు స్టేడియం మరింత దెబ్బ తినకుండా ఉండేందుకు తాళంవేసి మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశారు. జిల్లాకు సంబంధించిన క్రీడా అధికారులు ఎవరూ ఇండోర్ స్టేడియం గురించి పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో స్టేడియం ఎందుకు పనికిరాకుండా ఓ డస్ట్‌బిన్‌లా తయారైవుంది. అలాగే ఇండోర్ స్టేడియంకు అనుసంధానంగా క్రీడాకారుల వసతి కోసం నిర్మించిన గదులు సైతం అధ్వానంగా తయారయ్యాయి. ఆ గదుల వైపు వెళ్లేందుకు వీలులేని విధంగా ఉండటంతో అటువైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు.

నెలకు రూ.30 వేలు ఆదాయం

స్టేడియం నిర్వహణ ఖర్చుల కోసం ఆరు గదులను నిర్మించారు. ఈ ఆరు గదుల ద్వారా నెలకు 30 వేల రూపాయలు బాడుగ వస్తున్నట్లు క్రీడా అధికారులే చెబుతున్నారు. వాచ్‌మెన్‌కు ఆరువేలు జీతం పోగా మిగతా రూ.24 వేలు నేరుగా శాప్ ఖాతాలో జమ అవుతోంది. ఈ లెక్కన ఏడాదికి రూ.3లక్షలకు పైగా ఆదాయం వస్తున్నా స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో క్రీడాకారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. ఇక్కడి క్రీడా మైదానానికి పెద్ద సంఖ్యలోనే క్రీడాకారులు వచ్చి వివిధ క్రీడలను సాధన చేస్తున్నారు. స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకొస్తే ఇండోర్ గేమ్స్‌ను కూడా క్రీడాకారులు సాధన చేసేందుకు వీలవుతుంది. అలాగే మరుగుదొడ్లు వంటివి అందుబాటులోకి వచ్చి క్రీడాకారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.

కడుపులో భగ్గుమంటోంది



రాజంపేటలో ఇండోర్ స్టేడియం దుస్థితిని చూస్తే కడుపులో భగ్గుమంటోంది. రెండుకోట్ల రూపాయలకు పైగా వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియం ఎందుకు పనికిరాకుండా పోవడం చాలా బాధాకరం. స్టేడియంకు గదుల బాడుగ ద్వారా వచ్చే ఆదాయంతో అయినా ఇండోర్ స్టేడియంను క్రీడాకారులకు అందుబాటులోకి తీసురావచ్చు. ఆ దిశగా అధికారులు ఆలోచించడం లేదు. సమస్యలపై వెంటనే స్పందిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ అయినా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– షేక్ అబ్దుల్లా, మాజీ క్రికెటర్, రాజంపేట

క్రీడా మంత్రి చొరవ చూపాలి



క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జిల్లావాసి అయినందున రాజంపేటలోని ఇండోర్ స్టేడియంను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చొరవచూపితే అనతికాలంలోనే స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి వస్తుంది. రాజంపేటలో ఎంతో ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారు. ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వస్తే క్రీడాకారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

– నాయిని గిరిధర్, రాజంపేట

ఎస్టిమేషన్లు పంపాం

రాజంపేటలోని ఇండోర్ స్టేడియం అధ్వానంగా ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్టేడియంలో క్రీడలకు సంబంధించిన పరికరాల ఏర్పాటుకు, గదులను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు శాప్ అధికారులకు ఎస్టిమేషన్లు వేసి పంపాం. నిధులు మంజూరైతే ఇండోర్ స్టేడియాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– గౌస్‌బాషా, డీఎస్‌డీఓ, అన్నమయ్యజిల్లా

క్లుప్తంగా

రాష్ట్రస్థాయికి విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుల్లంపేట : మండలంలోని అండర్-17 రగ్బీ (ఎస్‌జీఎఫ్) బాలుర విభాగంలో సుబ్రమణ్యం, బాలికల విభాగంలో మణిమాల రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వత్తలూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగరాజు వెంకటసుబ్బరాజు, ఫిజికల్ డైరెక్టర్ కొమ్మా పార్థసారథిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం వారు విద్యార్థులను అభినందించారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతమే లక్ష్యం


సభ్యత్వం తీసుకుంటున్న సాయిలోకేష్

రాజంపేట టౌన్ : జిల్లాలో గ్రామస్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. స్థానిక బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో శనివారం ఆయన ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిండిబోయిన కృష్ణయాదవ్, వై.సురేష్‌రాజు, షబ్బీర్ అహమ్మద్, రమణయ్య, తోట శ్రీనివాస్‌ధీరజ్, నరేంద్రరాజు, సునీత, నారాయణవర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు

పుల్లంపేట : మండల కేంద్రం పరిధిలో శనివారం సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఎల్ఈడీ లైట్లుకు మరమ్మతులు నిర్వహించారు. అవసరమైన చోట కొత్త ఎల్ఈడీ లైట్లను వేశారు. లైట్లు పని చేయడం లేదంటూ ఫిర్యాదు రావడంతో సర్పంచ్ స్పందించి నూతన ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌ను అభినందించారు.

రేషన్‌షాపు కాటాలు తనిఖీ

సిద్దవటం : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ రేషన్ షాపుల కాటాలను తనిఖీ చేశామని కడపకు చెందిన తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ ఎం.వి.రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 ప్రభుత్వ రేషన్ షాపులకు సంబంధించి కాటాలను తనిఖీ చేసి తూకాల్లో వ్యత్యాసాలు ఉన్న కాటాలను సరిచేసి సీజ్ చేసి ముద్రలను వేశామన్నారు. కార్యక్రమంలో టెక్నీషియన్‌లు కొండలరావు, శివకుమార్, ప్రభుత్వ రేషన్ షాపు డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఒంటిమిట్ట : జిల్లాలో ఎవరైనా పంచాయతీకి సంబంధించిన స్థలాలు ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప జిల్లా పంచాయతీ అధికారిణి జి.రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని ఆమె దర్శించుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ స్థలాలను కాపాడే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. నిరుపయోగంగా ఉన్న ఎస్‌డబ్ల్యూ పీసీలను అమలులోకి తీసుకొస్తామని తద్వారా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలను సరైన సమయంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోమశేఖర్, ఈఓపీఆర్‌డీ కెఆర్ఎం ప్రసాద్, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దళితవాడకు శ్మశానం కేటాయించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిట్వేలి : బాలాజీనగర్ దళితవాడకు శ్మశాన స్థలం కేటాయించాలని సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, నియోజకవర్గ నాయకులు తిప్పన ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కంపసముద్రం పంచాయతీ బాలాజీనగర్ గ్రామ అవసరాలకు పక్కనే ఉన్న సర్వేనెంబర్ 393ఏ లో 2.21 ఎకరాలు ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాలకు దళితవాడకు కేటాయించినట్లు తహసీల్దార్ చెప్పారన్నారు. అయినా ఇంతవరకు బదిలీ జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఆ భూమిని దళితవాడకు కేటాయించకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చిన్నయ్య, ప్రసాద్‌లు హెచ్చరించారు.

నీటి సమస్య పరిష్కారం

ఓబులవారిపల్లె : తాగునీటికి ఇబ్బందులు పడుతున్న చిన్నంపల్లి దళితవాడ ప్రజల సమస్యను అధికారులు పరిష్కరించారు. శనివారం ఎంపీడీఓ మల్‌రెడ్డి గ్రామానికి ప్రత్యేకంగా పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం విషయమై ఘర్షణ..

వీరబల్లి : మండలంలోని తాటికుంటపల్లె పంచాయతీలో శికారిపాలెంకు చెందిన మనోహర్, గోవిందు శీను స్థలం విషయమై శుక్రవారం ఘర్షణ పడ్డారు. వివరాలు.. మనోహర్ తండ్రి అయిన పెంచలయ్య పేరుమీద సర్వే నెంబరు 776/2ఏలో 3.27 సెంట్లు కలదు, అయితే సదరు స్థలం గోవింద శీను తనదని చెప్పడంతో ఘర్షణకు దారి తీసింది. ఘర్షణలో మనోహర్, అతని భార్య గాయపడ్డారు. వీరు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రులకు చికిత్స కోసం వెళ్లారు. అక్కడ నుండి స్థానిక వీరబల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని ప్రమీలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.ప్రమీల జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చాటినట్టు పాఠశాల ప్రిన్సిపల్ హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శనివారం మాట్లాడుతూ కడప నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 25న నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో కడప, అన్నమయ్య జిల్లాల నుండి 169 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అందులో 16 మంది జోనల్‌స్థాయికి ఎంపికయ్యారన్నారు. తమ పాఠశాల విద్యార్థిని ప్రమీల ద్వితీయ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. ఎంఈఓ-2 అనంతకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


బండకాడపల్లెలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

గాలివీడు : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ జవహర్ బాబు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గోపనపల్లె గ్రామం బండకాడపల్లెలో పారిశుద్య పనులు చేపట్టారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ దోమలు విజృంభించకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పంచాయతీ సిబ్బంది గ్రామం అంతా బ్లీచింగ్ చల్లినట్లు తెలిపారు. ఇండ్లు, పరిసరాలతోపాటు మొత్తం గ్రామంలో మరుగునీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేశారు. అనంతరం మెడికల్ క్యాంపు పెట్టి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే సమస్యల అర్జీలు అందజేత



మల్లూరు గ్రామసభలో పాల్గొన్న అధికారులు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో రీసర్వే పైన శనివారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రీసర్వేలో ఏర్పడ్డ భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ గ్రామసభలను ఏర్పాటు చేసిందన్నారు. బాధిత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నజీర్‌బాషా, మండల సర్వేయర్ శ్యామల, పలువురు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వైద్యమిత్రల నిరసన

లక్కిరెడ్డిపల్లి : వైద్యసేవా పథకంలో 17 ఏళ్లుగా పని చేస్తున్న వైద్య మిత్రులు, టీమ్ లీడర్లు, ఆఫీసు అసోసియేట్లు, జిల్లా మేనేజర్, ట్రస్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పథకం నిర్వహణ బాధ్యతలను ఇన్సూరెన్సులోకి అప్పచెప్పుచున్న తరుణంలో ప్రస్తుతం పనిచేస్తున్న వారినందరినీ యథావిధిగా కొనసాగించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలను పెంచాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 29వ తేదీ డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు కార్యాలయం వద్ద మహాధర్నా చేస్తామని లక్కిరెడ్డిపల్లి ఏరియా ఆసుపత్రి వైద్య సేవా ఉద్యోగులు తెలియజేశారు.

నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

రాయచోటి (జగదాంబసెంటర్) : వాహనదారులు రహదారి భద్రతా నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలను తగ్గించవచ్చని రాయచోటి ట్రాఫిక్ సీఐ ఎస్.విశ్వనాథన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ రహదారిపై బాధ్యతతో వ్యవహరించడం వలన మన ప్రాణాలను రక్షించడమే కాకుండా.. ఇతరులను కూడా కాపాడగలదని ఆయన వివరించారు. అనంతరం రహదారి భద్రతా నియమాలపై ప్రదర్శనలు, పోస్టర్లు, వీడియోలు ప్రదర్శించబడ్డాయి. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని రహదారి భద్రతా నియమాలపై వివిధ ప్రశ్నలు అడిగి మరింత అవగాహన పొందారు. ప్రిన్సిపల్ శివశంకర్, ఎన్ఎస్ఎస్ పీఓ సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.